

# బాల సాహిత్యంలో
# శ్రీ గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు

"అద్దంలో మేడలు చూపగలవారు నివసించేవి అద్దాల మేడలు కావు"-
వసుంధర

## వసుంధర మాటల్లో:

ప్రముఖ పాత్రికేయులు, సినీ దర్శకులు శ్రీ విజయ బాపినీడు ఆధ్వర్యంలో వచ్చిన పిల్లల మాసపత్రిక 'బొమ్మరిల్లు' చందమామకు దీటు వచ్చేది. ఆ పత్రిక అంటే ప్రత్యేకాభిమానం ఉన్నా- 1988నాటికి పత్రిక మూసివేయడం మినహా గత్యంతరంలేదన్నంతగా- చలనచిత్ర  రంగంలో బిజీ అయిపోయారు శ్రీ బాపినీడు. అప్పుడాయన మమ్మల్ని మద్రాసుకి పిలిచి, తాను తిరిగి పత్రిక బాధ్యతలు చేపట్టేవరకూ- బొమ్మరిల్లు బాధ్యతలు స్వీకరించవలసిందిగా కోరారు. మేము కాదంటే- పత్రికను మూసివేయగలననడంతో- తప్పనిసరి పరిస్థితుల్లో ఆ బాధ్యతను స్వీకరించాం. కథల ఎన్నిక, తిరగవ్రాయడం, వివిధ శీర్షికల నిర్వహణతో- బొమ్మలు మినహాయించగా మిగిలిన రచనల్లో 90-95 శాతం భువనేశ్వర్లో మానుంచే నెలనెలా బొమ్మరిల్లుకి అందేవి. ఆ సమయంలో ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి, జొన్నలగడ్డ మార్కండేయులు, డి. కె. చదువులబాబు, ఆరుపల్లి గోవిందరాజులు, గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు వగైరా అప్పటికి సుప్రసిద్ధులుకాని ఎందరో రచయితల రచనలతో పరిచయమైంది. రచనల్లోని వైవిధ్యం పైవారిని అప్పట్లో బొమ్మరిల్లుకి ఇంచుమించు ఆస్థాన రచయితల్ని చేసింది. మేమెరిగిన ఇతర ప్రసిద్ధ రచయితలతోపాటు- అప్పటి బొమ్మరిల్లు రచయితలందర్నీ కూడా అక్షరజాలంలో పరిచయం చేయాలని మా ఆకాంక్ష. వారిలో గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు - కథల్లో 'మధిర' వారి కాశీ మజిలీలకు దీటు వచ్చే కల్పన ఉండేది. అందువల్ల ఆయన రచనల్లో ఎక్కువ- 'కరాళ కథలు'గా (చందమామలోని 'బేతాళ కథల' వంటివి)- మలచబడేవి. ప్రస్తుతం చందమామలో వీరి కథలు తరచు 'బేతాళ కథలు'గా రావడం- మా అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ఇక ఆయన గురించి  ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

# తన మాటల్లో:

నా పేరు గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు. నేనొక రచయితని.

నా చిన్నప్పుడు మా పల్లెనించి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ పల్లెకి కాలిబాటలో కాకుండా చిట్టడవికి అడ్డంపడి వెళ్ళాను. నూటికి నూరుపాళ్ళూ ఇదే నా స్వభావం. నేనేదైనా కార్యం తలపెడితే మీనమేషాలు లెక్కించను. మంచిచెడ్డలు విచారించను. ఎవరిపైనా ఆధారపడను. ఎవరి కోసమో ఎదురుచూడను. ఫలితమివ్వని సుదీర్ఘ చర్చలు ఇష్టపడను. ఒక్క ఆధారం దొరికితే చాలు, దూసుకు పోవడమే. ఈ పద్ధతి కరెక్టని నేను చెప్పను. కానీ ఇదే నా విధానం.

మా అమ్మ పేరు రామలక్ష్మమ్మ. ఆమె శతకకారుడు, 'సుకవి' బిరుదాంకితులైన- మలిశెట్టి శిద్దయ్యగారి కుమార్తె. మాది మధ్యతరగతి కుటుంబమైనా రాయల్ ఫామిలీ అన్న భ్రమలో ఆమె మమ్మల్ని పెంచింది. ముగ్గురు మగ, ముగ్గురు ఆడ సంతానంలో నేను పెద్దవాణ్ణి. మా తండ్రి పేరు పిచ్చయ్య. తను మద్రాసు యర్రగడ్డల కంపెనీ తరఫున ఏజంటుగా ఉంటూ బాగా సంపాదించేవాడు. మాది పున్నాటిగారిపల్లె అనే గ్రామం. మాకున్న ఆరెకరాల పొలంలో వరి, రాగి, సజ్జలు పంటల ద్వారా సంవత్సరానికి సరిపోయే తిండి గింజలూ, యర్రగడ్డల పంట ద్వారా నగదూ వచ్చేవి. వాస్తవం తెలియని నేను పగటికలల్లోనే కాలం గడుపుతూ సినిమా హీరో కావాలని కలలు కనేవాణ్ణి. కొన్ని ప్రయత్నాలు చేసి ఆ కలలు నెరవేరవని తెలుసుకునేసరికి నాకిద్దరు పిల్లలు. పైసా సంపాదన లేదు. పెళ్ళికిముందు నాలుగు గోడలమధ్య పెద్దనాన్న ఇంట్లోనో, ఊరికి సమీపంలోని ఓ కొండమీదనో- ఒంటరిగా, సమాజంతో సంబంధం లేనివాడిగా ఉండేవాణ్ణి. మరి కొంతకాలం పొలాలవద్ద ఆనందంగా గడిపాను. పెళ్ళయ్యేక నాకనుగుణంగా తన్ను తాను మలచుకోగలిగిన నా శ్రీమతి లక్ష్మీనరసమ్మ- ఇప్పుడు నా సైన్యాధిపతి, మంత్రి. ఇప్పుడామె సలహా లేకుండా ఏ పనీ చేయను. ఆమె లేకుండా ఎక్కడికీ వెళ్ళను.

ఓబిలివారిపల్లి రాయలసీమ గ్రామీణ బ్యాంకులో డైలీ డిపాజిట్ ఏజంట్ (జనకల్ప ఏజంట్)గా ఉద్యోగంలో చేరాక నాలో కొంత వికాసం వచ్చింది. అయితే అందులో నా ఆదాయం నెలకు 230 రూపాయలు మించలేదు. క్రమేణా ఆ ఆదాయం కూడా క్షీణించడంతో సంసారం జరగడం చాలా కష్టంగా ఉండేది. దానికి తోడు

వర్షాభావంవల్ల పంటలు పండకా, నాన్నకి ఉద్యోగం లేకా- మా కుటుంబపు ఆర్థిక పరిస్థితి క్షీణించింది.

బ్రతుకుతెరువుకి అందరం మా అమ్మ పుట్టిన ఊరు రాజంపేట చేరుకున్నాము. అప్పుడే మద్రాసు కంపెనీవాళ్ళు కోరినదానికన్నా ఎక్కువ జీతం ఇస్తూ మా నాన్నని మళ్ళీ ఉద్యోగంలోకి తీసుకున్నారు. ఏమీ పని చేయకపోయినా మరణించేవరకూ ప్రతి నెలా ఖచ్చితంగా ఒకటవ తేదీన జీతం ఇచ్చారు.

మా గ్రామస్థుల దృష్టిలో నేనొక అమాయక చక్రవర్తిని, బ్రతకలేనివాణ్ణి. అది అప్పట్లో నిరూపించుకునే అవకాశం రాలేదు కానీ నాలో గట్టి పట్టుదల ఉంది. రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఉన్నప్పుడు కష్టమర్లకి ఆలస్యం కాకుండా పనులు చేసిపెట్టేవాణ్ణి. ఇప్పుడు షాపులోనూ నాకు ఎన్ని అగచాట్లైనా కష్టమరుకి వీలైనంత తొందరగా సప్లై చేస్తున్నా. బ్యాంకు బ్రాంచ్‌లో పనిచేసిన అందరు మేనేజర్లూ నన్ను ఆదరించారు.

బ్యాంకుల్లోనూ, గవర్నమెంటు ఆఫీసుల్లోనూ పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనించాను. ఉద్యోగభద్రత కారణంగా సేఫ్ సైడ్‌లో ఉన్నామన్న ధీమా వారిది. ఇలాంటివారి కారణంగా సామాన్యజనం ఇబ్బందులు పడ్డం పరిపాటి. ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి వారిది. అదే బ్యాంకులో క్లర్కునయ్యుంటే- కష్టమర్లకి ఎంతో తోడ్పాటునందించేవాణ్ణనుకునేవాణ్ణి. కానీ ఇంటర్ మాత్రమే చదివిన నాకు ఉద్యోగం ఎవరిస్తారు? అంతకుముందు మా నాన్న స్నేహితుడు పోలీసు ఉద్యోగం ఇప్పిస్తానంటే- సినిమా హీరో కావాలనే కలల్లో ఉన్నందువల్ల- వద్దన్నాను. డిపాజిట్ కట్టి నన్ను బ్యాంకులో చేర్చిందీ ఆయనే.

ఆదాయం చాలక బ్యాంకులో జనకల్ప ఏజంట్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. తరువాత రాజంపేటలో పదకొండువందల రూపాయల బ్యాంకు ఋణంతో, నలభై రూపాయల అద్దెగదిలో, రోజుకి పది రూపాయల సంపాదన లక్ష్యంతో ఫోటో ఫ్రేం వర్క్ షాపు ప్రారంభించాను. మొదటి రోజు కలెక్షన్ ఏడు రూపాయలు.

షాపు ప్రారంభించేనాటికి ఈ పనిలో నాకేమాత్రం ప్రవేశం లేదు. ఈ పనిలో ముఖ్యమైన గ్లాస్ కటింగ్- అసలే చేతకాదు. చిన్నప్పుడు అడవికి అడ్డంపడి వెళ్ళినట్లే కష్టం నష్టం ఆలోచించకుండా ఈ పనిలోనూ దూసుకుపోతే- మూడు నెలల్లో పని నాకు లోబడింది. కష్టమర్ల పాఠాలు గుణపాఠాలు అయ్యాయి. వారు కోరిన విధంగా చెయ్యడం పాఠం. కొందరు కష్టమర్లు అత్యాశతోనూ, స్వార్థంతోనూ నష్టం కలిగించడం గుణపాఠం. తరువాత [illegible] అనే, దేవుని పటాల్లో బల్బులు అమర్చే పని స్వతహాగా నేర్చుకున్నాను. సంపాదన లక్ష్యం రోజుకు పదినుంచి వందకు మారి క్రమంగా ఇప్పటి వెయ్యికి చేరింది.

ఈ లక్ష్యసాధనకు నేను పడిన శ్రమ అంతాఇంతా కాదు. స్వసుఖాన్నీ, ఆకలినీ, ఆరోగ్యాన్నీ, నిద్రనీ ఏనాడూ పట్టించుకోలేదు.

మొదటినుంచీ నా తాపత్రయం ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలని. అది సాధ్యమై రెండు బిల్డింగ్స్ కట్టించాను. ఒకటి మెయిన్ రోడ్డులో ఉంది. అందులోనే ఇప్పుడు నా షాపు ఉంది. ప్రస్తుతం పెరిగిన రేట్లతో నా ఆస్తి విలువ దరిదాపు ముప్పై లక్షలు.

రాజంపేటకు వచ్చిన తరువాత వేరు కాపురం పెట్టాను. అప్పుడు నా ఆస్తి జీరో కాదు, మైనస్. ఆ స్థితినుంచి ఈ స్థితికి చేరుకోగలగడానికి- శక్తికి మించి శ్రమపడడమొక్కటే కారణం. నా ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోయినా- ఈ

వ్యాపారంలో నాతో పోటీ పడిన యువకుల్ని సైతం ఓడించాను. ఈ ఊరిలో ఈ వ్యాపారంలో ఇలా నిలదొక్కుకున్నవాణ్ణి నేనొక్కణ్ణే. వ్యాపారం తప్ప మరేదీ పట్టించుకోకపోవడం కూడా ఒక బలహీనతే. నా పెద్ద కుమారుడు కంప్యూటర్ జాబ్ వర్క్ చేస్తూనే- నా పనిలోనూ పాలు పంచుకుంటూ నాలాగే అధికంగా శ్రమిస్తున్నాడు. సినీరంగంలో నెగ్గుకు రావాలంటే- జీవితాన్ని ఫణంగా పెట్టాలి కానీ రచనా వ్యాసంగానికి పది రూపాయల పెట్టుబడి చాలు. అలా నా ఆలోచనలను వెలుగులోకి తేవచ్చు. ప్రతిభ చూపవచ్చుననుకుని రచయితనయ్యాను. పగలు తీరిక లేని నేను వ్రాసేది ఎక్కువ భాగం అర్ధరాత్రి 2 గంటల తరువాతే. కథలకు నూతనత్వం తప్పనిసరి, కథల్లో నీతి అంతర్లీనం, వినోదం ప్రముఖం- అనుకుంటాను. స్వేచ్ఛగా, మనసుకి నచ్చేలా వ్రాయడానికి ప్రోత్సాహం అందిస్తూ- నా కథలను ఆదరించి, రచయితగా చిగురింవడానికి కారణమైన ప్రముఖ జంట శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి, డాక్టర్ జొన్నలగడ్డ రాజగోపాలరావు గార్లకు నిరంతరం కృతజ్ఞుణ్ణి. ఈనాడు చందమామలో రచయితగా కొనసాగడానికి వారందించిన ప్రోత్సాహమే కారణం.

**చిరునామా:**

గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు, క్రాంతి గ్లాస్ వర్క్స్, 2/573 శివాలయంవీధి, రాజంపేట, కడప జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
ఫోన్: 08565-248307, సెల్: 9951209140, 9948572875

# శ్రీ గుండ్రాతి సుబ్రహ్మణ్యంగౌడు రచనలు

## బొమ్మరిల్లు:

1. మహాబలుడు (1980 ఆగస్టు)
2. రాక్షసుడి ప్రేమ (1990 ఆగస్టు )
3 తరగని సంపద
4. రాజు చూసిన నాటకం
5. నమ్మిన బంటు
6. మంచి-చెడు
7. అగస్తి కోరిక
8. దేవుని గెలిచిన చిలుక
9. కమలుడి తప్పు
10. అదృశ్య సంచాలకుడు
11. ముగ్గురు మిత్రులు
12. రెండు రాజ్యాలమధ్య యుద్ధం
13. అబద్ధపు మనిషికి నకిలీ రంగు
14. సోమరి- దయ్యం

15. జన్మవిముక్తి

16. హర్షిత కోరిక

17. సింహదమనుడి న్యాయం

18. తిరగబడ్డ పసిబిడ్డ

19 అతిబలుడు-అందాలరాశి

20. కొత్తపల్లె

21. సంకల్పబలం

22. అక్కాచెల్లెళ్ళు

23. నాగలోక ప్రదేశం

24. శిల్ప ప్రేమికులు

25. ఊరుకదిలింది

26. ద్వంద్వ యుద్ధం

27. దొంగలు

28. చిన్నదాని పెద్దకోరిక

29. మనుష్య సంపద

30. వృషపర్వుడి ప్రయోగం

31. పంచవీరుల

32. నిజమైన ప్రేమికుడు

33. అహంకారి

34. శత్రు వివాహం

35. పంచరంగుల పంజరం

36. ఆదర్శ మహిళ

37. వెంకయ్య తెలివి

38. మహర్షి మాట

39. మంగరాజు ఎత్తు

40 ప్రజాక్షేమం

41. ఇద్దరు మంచివాళ్ళు

42 వృత్తిధర్మం

43. కులదీపం

44. ఉషస్వి కోరిన వడ్డాణం

45. రాజుగారి వింతకోరిక

46. వివేకవతి

47. మహిమగల మనసు

48. సామ్రాజ్ఞి

49. పదవి తెచ్చినపెద్దరికం

50. దేవుడిపరీక్ష

51. సరికొత్తశిక్ష

52 ధర్మరక్షణ

53. కర్తవ్యం

54. సేవాధర్మం

55. కట్నంలీల

56. కొత్తవెలుగు

## బాలభారతి:

1. రవి గాంచనిచో

## బుజ్జాయి:

1. ఉడుకు నెత్తురు

2. అవ్వ-మనవడు

3. న్యాయం వర్ధిల్లాలి

(మరికొన్ని కథల వివరాలు తెలియవు)

## చందమామ:

1. ధనపిపాసి
2. కుర్రమాంత్రికుడు
3. తిరుపెమ్మ-తిరుపాలు

## చందమామ బేతాళకథలు:

1. స్వర్ణరేఖ ఆశాభంగం
2. ఉత్పలాక్షి ప్రేమ
3. సహనశీలం
4. వింతప్రేమ
5. నలుగురు కార్య సాధకులు
6. నీలాంజనచర్య
7. చిముకుడి సాహసం
8. విహంగభూషణుడిచర్య
9. ధర్మ మార్గం
10. శశికళనిర్ణయం